సాక్షి
వికారాబాద్

ఆదివారం । 12 । నవంబర్ । 2023



ప్రలోభాల ఎర

అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. ఇక పోలింగ్ సమయం దగ్గరపడుతోంది. 10లో ▸



దీపావళి సందడి

చీకటిని చీల్చుతూ వెలుగులు నింపే దీపావళి వేడుకలు జరుపుకొనేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. 10లో ▸



'గ్యారంటీ'కి భవిష్యత్తు లేదు

ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెబుతున్న కాంగ్రెస్ మాటలు నమ్మకండని పలువురు నేతలు పేర్కొన్నారు. 11లో ▸

న్యూస్‌రీల్

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్

తాండూరు రూరల్: ఎన్నికల విధుల్లో ఉన్న వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్ సూచించారు. శనివారం తాండూరు పట్టణంలోని రిటర్నింగ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు వజ్రాయుధం అని, కావున ప్రతి ఒక్కరూ ఆ హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు, సిబ్బంది తమ ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వేయాలని చెప్పారు. కార్యక్రమంలో తాండూరు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి(ఆర్డీఓ)శ్రీనివాస్‌రావు ఉన్నారు.

గాయపడిన కానిస్టేబుల్ మృతి

అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు



గాలిలో కాల్పులు జరుపుతున్న పోలీసులు

పరిగి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. పరిగి మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన ఫౌజియా(26) సైబరాబాద్ కమిషనరేట్ పరిధి కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించేవాడు. రెండు వారాల క్రితం ఆయన రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. సొంత గ్రామం నారాయణపురంలో శనివారం అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు. కానిస్టేబుల్ మృతిపట్ల కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టి.రామ్మోహన్ రెడ్డి సంతాపం తెలిపారు.

అభ్యర్థులకు పేర్ల తలనొప్పి

తాండూరు: తాండూరు అసెంబ్లీ బరిలో ఉన్న ప్రధాన పార్టీ అభ్యర్థులకు కొత్త చిక్కు వచ్చిపడింది. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మనోహర్‌రెడ్డి పేర్లు కలిగిన ఇద్దరు నామినేషన్ దాఖలు చేయడంతో ఓట్లు చీలిపోయే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి పేరు కలిగిన వ్యక్తి పోటీ చేయడంతో ఆయన ఓటు బ్యాంకుకు గండిపడి ఓటమిపాలయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు చెందిన నేతల పేర్లు కలిగిన వారు బరిలో నిలిచారు. ఆల్విన్ కాలనీ, మియాపూర్, శేరిలింగం పల్లి చెందిన పి.రోహిత్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా అత్వెల్లి గ్రామానికి చెందిన దాది మనోహర్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేశారు. ఈ ఇద్దరు ఎవరి ఓటు బ్యాంకుకు గండి కొడతారనే చర్చ జరుగుతోంది. గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రధాన పార్టీల అభ్యర్థులు.. వారి నామినేషన్లను ఉపసంహరించుకునే విధంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

అక్రమ మద్యాన్ని అరికడతాం

సరూర్‌నగర్ యూనిట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్ రావు

మహేశ్వరం: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మద్యం పంపిణీ చేసినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తప్పవని రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ యూనిట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్ రావు హెచ్చరించారు. మహేశ్వరం ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. వాహనాల తనిఖీల్లో మద్యం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. బెల్టు దుకాణాలు, గంజాయి, గుడుంబా నియంత్రణకు ప్రత్యేక టీమ్‌లతో నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, కల్వకుర్తి, ఎల్‌బీనగర్ నియోజకవర్గాల్లో రూ.3.46 కోట్ల విలువ చేసే 1,15,151 లీటర్ల మద్యం, రూ.19.53 లక్షల విలువైన 78 కిలోల గంజాయి, నాలుగు వాహనాలను సీజ్ చేశామన్నారు. మహేశ్వరం ఎక్సైజ్ కార్యాలయం పరిధిలో 72 కేసులు నమోదు చేసి, రూ.58.20 లక్షల విలువ చేసే 6,380 లీటర్ల మద్యం, 81 లీటర్ల ఇతర రాష్ట్రాల మద్యం పట్టుకున్నట్లు చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్, ఎక్సైజ్ టీమ్, స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లను విభజించి దాడులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్రమ మద్యం విక్రయాలు, నిల్వ సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఇక ప్రచార హోరు



వ్యూహాలు రచిస్తున్న నేతలు

- ఓటరు దర్శనానికి అభ్యర్థుల కసరత్తు
- కొందరికి తప్పని తిరుగు 'పోట్లు'
- గెలుపే ధ్యేయంగా సాగుతున్న పార్టీలు
- వీడని అసమ్మతి సెగలు, కొనసాగుతున్న బుజ్జగింపులు

వికారాబాద్: ఎన్నికల తదుపరి ఘట్టానికి తెరలేచింది. నామినేషన్ల గడువు ముగిసిన నేపథ్యంలో ఇక జిల్లాలో ప్రచార హోరెత్తనుంది. గెలుపే ధ్యేయంగా రాజకీయ పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. తమ బాణీ, వాణిని ప్రజలకు వినిపించేందుకు సన్నద్ధం అవుతున్నాయి. ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో అభ్యర్థులు ప్రచార బాట పట్టనున్నారు. తాండూరు కాంగ్రెస్ అభ్యర్థి మినహా.. మిగిలిన కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను నెలముందే ప్రకటించడంతో ఇప్పటికే ఒక విడత గ్రామాలను చుట్టేశారు. అధికార బీఆర్ఎస్‌తో పోలిస్తే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను కాస్త ఆలస్యంగా ప్రకటించినప్పటికీ ఎక్కువ శాతం టికెట్లు పాతకాపులకే దక్కటంతో ప్రజలవద్దకు వెళ్లేందుకు పెద్దగా ఇబ్బంది కనిపించటంలేదు. కాంగ్రెస్ తాండూరు అభ్యర్థి మనోహర్‌రెడ్డి మినహా నాలుగు నియోజకవర్గాల్లో అధికార ప్రతిపక్ష పార్టీల తరఫున పోటీ చేస్తున్న వారందరూ పాతవారే కావటం గమనార్హం.

అభ్యర్థుల పోటాపోటీ

నామినేషన్ల ఘట్టం ముగియడంతో పల్లెల్లో ప్రచార జోరు కనిపించనుంది. ఓటర్ను సన్నద్ధం చేసుకోవడానికి అభ్యర్థులు పోటీ పడుతున్నారు. కొడంగల్, పరిగిలో కాంగ్రెస్ అభ్యర్థులు రేవంత్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థులు నరేందర్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, వికారాబాద్‌లో మెతుకు ఆనంద్, గడ్డం ప్రసాద్ కుమార్ ప్రచారం ముమ్మరం చేశారు. ఇక తాండూరులో గతంలో కాంగ్రెస్ నుంచి గెలిచిన రోహిత్‌రెడ్డి ఈసారి బీఆర్ఎస్ బీఫామ్‌తో పోటీ చేశారు. డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న మనోహర్‌రెడ్డి ఇటీవలే అధికార పార్టీ నుంచి హస్తం గూటికి చేరడంతో రాజకీయం మరింత వేడెక్కింది.

అసమ్మతిరాగం..

జిల్లాలోని నాలుగు సెగ్మెంట్లలో కొద్ది రోజుల క్రితం వరకు అన్ని ప్రధాన పార్టీల్లో అసమ్మతి సెగలు రగిలాయి. ప్రతిపక్ష కాంగ్రెస్‌లో కాస్త తక్కువగా ఉండగా, అధికార బీఆర్ఎస్‌లో తారస్థాయికి చేరిన విషయం తెలిసిందే. వికారాబాద్, పరిగిలో తొలుత ఎవరికి వారే అయినా.. ఇప్పుడిప్పుడే ఏకమవుతున్నారు. ఇందులో చాలా వరకు ఇక్కడ ఇమడలేక ఇతర పార్టీల్లో చేరిపోయారు. వెళ్లిపోగా మిగిలిన వారు ఇటీవలి వరకు అలక బూనినా.. ప్రస్తుతానికి పార్టీ నిర్ణయానికి కట్టుబడి అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేస్తామని పేర్కొంటున్నారు. అయితే వీరి విషయంలో అభ్యర్థులకు మాత్రం ఇంకా లోలోపల భయం వీడటం లేదని తెలుస్తోంది. బీఆర్ఎస్‌లో అసమ్మతి నేతలను బుజ్జగించేందుకు కొంతకాలంగా మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి ప్రయత్నిస్తూ రాగా.. చివరకు మంత్రి కేటీఆర్ రంగంలోకి దిగాల్సి వచ్చింది. ఆయన సర్ది చెప్పటంతో కొందరు పార్టీతో కలిసి నడుస్తుండగా.. మరికొందరు హస్తం గూటికి చేరుకున్నారు.



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న టీఆర్ఆర్ తదితరులు

హామీల అమలులో విఫలం

- ప్రజలను మోసం చేసిన కేసీఆర్
- అధికారంలోకి వచ్చిన వెంటనే 'గ్యారంటీ'ల అమలు
- పరిగి అసెంబ్లీ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి

పరిగి: అధికారం ఇచ్చిన ప్రజలను ముఖ్యమంత్రి కేసీఆర్ నిలువు దోపిడీ చేశారని పరిగి అసెంబ్లీ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పరిగి మండలం ఇబ్రాహింపూర్, గడిసింగాపూర్, రంగంపల్లి గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల నగారా మోగినప్పటి నుంచి కేసీఆర్‌కు భయం పట్టుకుందని విమర్శించారు. రెండుసార్లు నమ్మిన ప్రజలు.. ఈ సారి ఆయన మాయ మాటలను నమ్మే స్థితిలో లేరన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా.. మరోసారి ఓట్లడిగితే ప్రజలు తిరగబడతారని చెప్పారు. ఇక్కడ తానే కుర్చీ వేసుకుని పనులు చేయిస్తానని చెప్పిన కేసీఆర్.. ఐదేళ్లలో ఒక్కసారైనా వచ్చారా అని ప్రశ్నించారు. పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు నేటికీ ప్రారంభం కాలేదన్నారు.

'రైతుబంధు' పెంచుతాం..

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అర్హులందరికీ అందజేస్తామని టీఆర్ఆర్ చెప్పారు. రైతు సంక్షేమం కోసం రైతుబంధు డబ్బులను మరింత పెంచుతామని, రైతుబీమా, ఇందిరమ్మ ఇల్లు తదితర పథకాలను వంద రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. దేశం, రాష్ట్రం ఇంత అభివృద్ధి చెందడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనని, తమ హయాంలో తీసుకువచ్చిన సంస్కరణలతోనే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీకి, తెలంగాణలో పార్టీని ఆదరించి, అధికారం బహుమతిగా ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంత్ ముదిరాజ్, పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, సీనియర్ నాయకుడు చంద్రయ్య, శ్రీను, పట్టణ అధ్యక్షుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించాలి

- సిబ్బంది సెలవులో వెళ్లరాదు..
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి
- ఓటరు తుది జాబితా విడుదల

వికారాబాద్ అర్బన్: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసిందని, వచ్చిన నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణరెడ్డి అన్నారు. శనివారం సంబంధిత అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. నాలుగు నియోజకవర్గాల నామినేషన్లను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పరిశీలించాలని రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా గుండెకాయ లాంటిదని, తప్పుడు లేని జాబితాను రూపొందించాలన్నారు. ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్పులను బీఎల్‌ఓల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేయాలని చెప్పారు.

సమష్టిగా ముందుకు సాగాలి

ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఆదివారం సాయంత్రం వరకు నియోజకవర్గాల వారీగా పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం 12డి స్వీకరించాలని సూచించారు. సి విజిల్ ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అన్ని మున్సిపల్, గ్రామపంచాయతీల పరిధిలో హోర్డింగులు, పోస్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సిబ్బంది సెలవులో వెళ్లరాదని, విధులు పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరం మేరకు సమావేశాలు నిర్వహించుకుంటూ ముందుకు సాగాలని సంబంధిత అధికారులకు సూచించారు.



కలెక్టర్ నారాయణరెడ్డి

9.60 లక్షల మంది ఓటర్లు


ఓటరు తుది ఓటరు జాబితాను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ప్రకటించారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 9,60,376 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. 2018లో 8,84,282 మంది ఓటర్లు ఉండగా.. ప్రస్తుతం 76 వేలకు పైగా పెరిగింది. ఇందులో అన్ని సెగ్మెంట్లలో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉండటం గమనార్హం.

నియోజకవర్గం	పురుష ఓటర్లు	మహిళలు	ట్రాన్స్ జెండర్స్	మొత్తం
పరిగి	1,31,163	1,28,250	9	2,59,422
వికారాబాద్	1,13,919	1,14,321	13	2,28,253
తాండూరు	1,15,143	1,20,927	6	2,36,076
కొడంగల్	1,17,303	1,19,310	12	2,36,625
మొత్తం	4,77,528	4,82,808	40	9,60,376

కొడంగల్ కోటలో పాగా ఎవరిదో?

నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. పీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి ఒకవైపు, పట్నం నరేందర్‌రెడ్డి మరోవైపు బరిలో ఉన్నారు. ఇద్దరు రాజకీయ ఉద్దండుల రణరంగానికి కొడంగల్ వేదికగా మారింది. ఇరు పార్టీల నడుమ పోటీ గట్టిగా ఉండడంతో.. ఇక్కడి ప్రజలు ఎవరికి మద్దతు ఇస్తారో వేచి చూడాలి..

- బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్
- రేవంత్‌ను ఓడించడమే కేటీఆర్ లక్ష్యం
- గెలుపు కోసం రేవంత్‌రెడ్డి కృషి
- ఆత్మ గౌరవం పేరుతో బరిలోకి
- అభివృద్ధి మంత్రంతో అధికార పార్టీ



జంగ్ తెలంగాణ



నరేందర్‌రెడ్డి (బీఆర్ఎస్)



రేవంత్‌రెడ్డి (కాంగ్రెస్)

కొడంగల్: కొడంగల్ సెగ్మెంట్ పరిధి కోస్గి, మద్దూరు మండలాల నుంచి అధికార బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకులు ఎక్కువగా కాంగ్రెస్‌లో చేరుతుండగా.. ఈ వ్యవహారం గులాబీ పెద్దలకు తలనొప్పిగా మారింది. మిగతా వారిపై ఈ ప్రభావం చూపుతోంది. ఇదిలా ఉండగా.. కొడంగల్ కోటలో పాగా వేసేందుకు రెండు ప్రధాన పార్టీలు తహతహలాడుతున్నాయి. ఇక్కడి ప్రజల ఆత్మగౌరవమే తనకు ముఖ్యమని రేవంత్ ప్రచారం చేయగా.. రేవంత్‌రెడ్డిని ఓడించడమే లక్ష్యంగా మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు పనిచేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. రేవంత్‌ను ఓడించి తీరుతామని, డిసెంబర్3న ఇదే బహిర్గతం అవుతుందని మంత్రి కేటీఆర్ ఇటీవల మీడియా ద్వారా వెల్లడించారు. వీలు దొరికిన ప్రతిసారి ఇరు పార్టీల నేతలు చూసుకుందాం ఎవరో ఓడతారో? అంటూ సవాల్ విసురుకుంటున్నారు. మొత్తానికి నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో గెలుపుపై ఎవరి అంచనాలు వారికున్నాయి. గెలుపు తమదేనంటూ రేవంత్, నరేందర్‌రెడ్డి ధీమా వ్యక్తంచేస్తున్నారు.

ఓటర్ నాడి ఎటువైపు?

నియోజకవర్గ ఓటర్లు ఎటువైపు ఉన్నారో నేతలు పసిగట్ట లేకపోతున్నారు. 1983లో ఎన్టీఆర్ ప్రభంజనంలో ఇక్కడ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. 2014లో తెలంగాణ ఉద్యమాన్ని సైతం లెక్కచేయకుండా ప్రజలు కొడంగల్‌లో టీడీపీని గెలిపించారు. కొడంగల్ ఆది నుంచి కాంగ్రెస్, టీడీపీలకు కంచుకోటగా ఉంది. కొడంగల్‌లో ఒకదఫా కాంగ్రెస్‌ను గెలిపిస్తే మరోదఫా టీడీపీని గెలిపించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. 2014 ఎన్నికల వరకు కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల మధ్యనే పోటీ ఉండేది. 2018లో తొలిసారి బీఆర్ఎస్ పార్టీ గెలిచింది. నియోజకవర్గానికి 15 సార్లు ఎన్నికలు జరిగాయి. అందులో 14 సార్లు సార్వత్రిక ఎన్నికలు కాగా.. ఒకసారి ఉప ఎన్నిక జరిగింది. కాంగ్రెస్ ఐదుసార్లు, టీడీపీ నాలుగు సార్లు, స్వతంత్ర అభ్యర్థులు నాలుగుసార్లు గెలిచారు. 1996లో జరిగిన ఉప ఎన్నికలో టీడీపీ గెలిచింది. 2018లో మొదటిసారి బీఆర్ఎస్ గెలిచింది. 2023లో ప్రజలు ఎవరికి పట్టం కడతారోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

కీలకంగా మారిన గురునాథ్‌రెడ్డి

కొడంగల్‌లో మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి కీలకంగా మారారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన బీఆర్ఎస్ తరఫున ప్రచారం చేసి నరేందర్‌రెడ్డిని గెలిపించారు. ఈ సారి గురునాథ్‌రెడ్డికి అధికార పార్టీలో సముచిత స్థానం దక్కకపోవడంతో ఆయన ఈ దఫా రేవంత్‌కు మద్దతు ఇచ్చారు. గురునాథ్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి రేవంత్ విజయం కోసం శ్రమిస్తున్నారు. నియోజకవర్గంలో ఉన్న తన అనుచరులను కాంగ్రెస్ గూటికి చేరుస్తున్నారు. ఇప్పటికే గులాబీకి ఇబ్బందికర వాతావరణం కల్పించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కొడంగల్‌లో బీఆర్ఎస్‌ను ఓడించేందుకు యత్నిస్తున్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం



కొత్తూర్‌లో మాట్లాడుతున్న కేఎల్ఆర్

- పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎల్ఆర్

కందుకూరు: మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం తథ్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) ధీమా వ్యక్తం చేశారు. జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్ ఆధ్వర్యంలో శనివారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల పరిధి 15 గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. వివిధ గ్రామాల్లో పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను పక్కాగా అమలు చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాటలు తప్ప, చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో బడంగ్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ చిగురింత పారిజాత, వైస్ ఎంపీపీ జి.శమంత, పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు సరికొండ మల్లేశ్, నాయకులు వెంకట్‌రామ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్టీలో భారీగా చేరికలు

మండల పరిధి మీర్‌ఖాన్‌పేట బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి కేఎల్ఆర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఢిల్లీ వెంకటేశ్, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ నర్సింహతో పాటు ఉప సర్పంచ్ శకుంతల, వార్డు సభ్యులు, నాయకులు నర్సింహ, మంజుల, సాయిలమ్మ, ఎస్.శంకరయ్య, గీత, మహేశ్, వినయ్‌కుమార్, సంతోష్‌కుమార్, రాజు, శ్రీనివాస్, విజేందర్, వెంకటేశ్, రాములు, విష్ణు, డప్పు రాములు పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు మదన్‌పాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రోహిత్‌రెడ్డిని ఓడించడమే లక్ష్యం

- తాండూరు ప్రజలను మోసం చేసిన అతనికి గుణపాఠం చెప్పాలి
- లిక్కర్ కేసులో కేసీఆర్ కూతురు జైలుకు వెళ్లడం ఖాయం
- చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు: తాండూరు ప్రజలను మోసం చేయటమే కాకుండా.. బీజేపీపై బురద జల్లిన రోహిత్‌రెడ్డిని ఓడించడమే లక్ష్యంగా పని చేస్తామని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, నాయకులు నరేష్ మహరాజ్‌లతో కలిసి మాట్లాడారు. ఎమ్మెల్యే రోహిత్ తననే కాదు, ఇక్కడి ప్రజలను నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. నమ్మించి గొంతు కోయడంలో అతన్ని మించిన వాడు ఎవరూ లేరని, అలాంటి వ్యక్తి మరోసారి గెలిస్తే తాండూరు సర్వనాశనం అవుతుందని మండిపడ్డారు. బీజేపీని అప్రతిష్టపాలు చేయడమే కాకుండా.. పార్టీ కీలక వ్యక్తి బీఎల్ సంతోష్‌పై ఇష్టానుసారంగా మాట్లాడిన వ్యక్తికి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఆయనకు భవిష్యత్తు లేకుండా తీర్పునివ్వాలని ప్రజలను కోరారు.

క్రమశిక్షణతో కమలనాథులు

తాండూరులో బీజేపీ అభ్యర్థి ఎవరూ పోటీ చేయడం లేదని, అయినా కమలనాథులు క్రమశిక్షణతో ఉండటం సంతోషంగా ఉందన్నారు. పొత్తులో భాగంగా సెగ్మెంట్‌లో జనసేన అభ్యర్థి పోటీలో ఉన్నారని తెలిపారు. అయితే జనసేన పార్టీ.. రాష్ట్రంలో 32 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తుందని ఎన్నికల సంఘానికి అసెంబ్లీ స్థానాల పేర్లు సమర్పించిందని పేర్కొన్నారు. అందులో తాండూరు అసెంబ్లీ పేరు లేకపోవడంతో జనసేన తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థి, ఇండిపెండెంట్‌గా బరిలో ఉండే అవకాశం ఉందని చెప్పారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటే తమ మద్దతు ఉండదని స్పష్టం చేశారు. బీజేపీ అభ్యర్థి పోటీలో లేకపోవడంతో ఎవరికి ఓటు వేయాలని కార్యకర్తలు అడుగుతున్నారని, అయితే తాను మాత్రం పార్టీకి నష్టం కలిగించేలా చేసిన రోహిత్‌రెడ్డి ఓటమే లక్ష్యంగా పని చేయాలని సూచించినట్లు వెల్లడించారు.

ప్రధాని హ్యాట్రిక్ ఖాయం

జాతీయ స్థాయిలో బీజేపీ ప్రభుత్వం మరో ఆరు నెలల్లో ఏర్పాటవుతుందని, ప్రధాని మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం ఖాయమని కొండా ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో బలం నిరూపించుకొంటుందన్నారు. అందుకోసం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో పాటు బండి సంజయ్‌లు అడుగులు వేస్తున్నారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ.లక్ష కోట్లను కొల్లగొట్టిన సీఎం కేసీఆర్.. ఓటమే ధ్యేయంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. లిక్కర్ స్కాంలో కేసీఆర్ తనయను అరెస్టు చేయకపోవడం కొంత ఆందోళన కలిగించిందన్నారు. స్కాంలకు పాల్పడిన మాజీ ముఖ్య మంత్రులను 30 ఏళ్ల తర్వాత అరెస్టు చేసిన సందర్భాలున్నాయని, కేసీఆర్ కూతురుకు అంత సమయం బీజేపీ ఇవ్వదని, మరో 6 నెలల్లో జైలుకు పంపిస్తామన్నారు. తాను పార్టీ మారతానని కొందరు దుష్ప్రచారం చేశారని ఆరోపించారు. తనకు పార్టీలో సముచిత స్థానం ఉందని, పార్టీ మారాల్సిన అవసరం లేదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల నుంచి ఎంపీగా గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇందులో పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్‌లు అంతారం లలిత, బాలప్ప, నాయకులు ఉన్నారు.

క్లుప్తంగా

తిరిగి బీఆర్‌ఎస్‌లోకి రండి

కన్నతల్లిలాంటి పార్టీని మోసం చేయొద్దు



తాండూరు రూరల్: ఐక్యతా చాటుతున్న నాయకులు, కార్యకర్తలు

తాండూరు రూరల్: బీఆర్‌ఎస్‌ను వీడిన నాయకులు తిరిగి పార్టీలోకి రావాలని ఆపార్టీ నాయకులు పిలుపు నిచ్చారు. శనివారం మండలంలోని గౌతపూర్ సమీపంలో ఉన్న భవాని ఫంక్షన్‌హాల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నుంచి పదవులు పొందిన నాయకులు కన్నతల్లిలాంటి పార్టీని వీడడం బాధకరమన్నారు. పార్టీని వీడిన వారు తిరిగి పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డితోనే తాండూరు అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రాజప్పగౌడ్ ,వీరేందర్‌రెడ్డి ,నరేందర్‌రెడ్డి, గాడి వెంకటేశం, రవిసింధే, రాంలింగారెడ్డిలు ఉన్నారు.

పోలీసుల తనిఖీలో రూ.8.44 లక్షలు స్వాధీనం

మొయినాబాద్: ఎన్నికల కోడ్ నేథ్యంలో పోలీసుల తనిఖీల్లో రూ.8.44 లక్షల నగదు పట్టిబడింది. మండలంలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో శనివారం పోలీసులు, స్పెషల్ టీమ్‌తో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ వ్యక్తి తన వాహనంలో రూ.8,44,236 నగదు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవటంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తోల్‌కట్ట సమీపంలోని ఎస్‌ఎంఎం ఫామ్‌హౌస్‌లో అనుమతి లేకుండా, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ మొత్తంలో మద్యం బాటిళ్లు నిల్వ చేసినందుకు పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. 11.97 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు.

కేసీఆర్‌తోనే రాష్ట్రాభివృద్ధి

బీఆర్‌ఎస్ చేవెళ్ల నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి

శంకర్‌పల్లి: సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని బీఆర్‌ఎస్ చేవెళ్ల నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్యకు మద్దతుగా శంకర్‌పల్లి మండల, మున్సిపల్ బీఆర్‌ఎస్ యువజన విభాగాల ఆధ్వర్యంలో యువ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతీ ఇంటికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే చేవెళ్ల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికి తను నిరంతరం కృషి చేస్తునట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ చేవెళ్ల నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారన్నారు. కేసీఆర్ ప్రవేశ పెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను బూత్ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ, చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, మున్సిపల్ యువజన విభాగం అధ్యక్షుడు పాండురంగారెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, వైస్ చైర్మన కురుమ వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గోపాల్, మున్సిపల్ అధ్యక్షుడు వాహేదేమ్‌ఖన్నా, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్లకు తెర.. ప్రలోభాల ఎర

పార్టీల్లో అసంతృప్తులపై కన్ను

- విందు భోజనాలతో సమావేశాలు
- జోరందుకున్న చేరికలు

దౌల్తాబాద్: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. ఇక పోలింగ్ సమయం దగ్గరపడుతోంది. ఈ నేపథ్యంలో పోటీలో నిలిచే ఆయా పార్టీల అభ్యర్థులు ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రలోభాలకు తెరతీశారు. గ్రామాల్లో ఇంటింటి ప్రచారాలు, పదునైనా వ్యూహంతో బరిలో నిలిచిన అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఆయా పార్టీలో అలకబూనిన నాయకులను, కార్యకర్తలను బుజ్జగిస్తున్నారు. వారు పార్టీలో నుంచి చేజారిపోకుండా ప్రలోభాలకు గురిచేస్తున్నారు. వారికి తాయిలాలు, రానున్న రోజుల్లో పదవుల హామీలు ఇచ్చి తమ వైపు తిప్పుకుంటున్నారు. గ్రామాల్లో ఇప్పటికే కులాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. తండాల్లో గిరిజనులకు హామీలు ఇస్తున్నారు. వారికి భోజనాలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించి వారి సమస్యలు వింటూ వాటిని అమలు చేస్తామని భరోసా కల్పిస్తున్నారు. కులానికి ఓ పార్టీ నాయకుడు సమావేశం పెట్టి విందు భోజనాలు ఏర్పాటు చేస్తే, మరునాడే మరో అభ్యర్థి అక్కడే సమావేశం నిర్వహించి విందు భోజనాలు ఏర్పాటు చేసి ప్రత్యర్థులను మించి హామీలిస్తున్నారు. దీంతో అక్కడి ప్రజలు ఎవరు ఏ పా ర్టీలో ఉన్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ఒక రోజు ఓ పార్టీ కండువా కప్పుకున్న వాళ్లు మరునాడే మరో పార్టీ కండువా కప్పుకుంటున్నారు. ఆయా పార్టీల అభ్యర్థులు నిర్వహిస్తున్న సభలు, సమావేశాలు ఎన్నికల వ్యయం పరిధిలోకి రాకుండా తెలివిగా వ్యవహరిస్తున్నారు. వీరు సభలు నిర్వహిస్తున్న ప్రాంతంలో ఏదో ఒక పుట్టిన రోజు, పెళ్లిరోజు నిర్వహిస్తూ విందు భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కొడంగల్‌లో రాజకీయం రసవత్తరంగా మారింది.



గెలుపే లక్ష్యంగా ముందుకు..

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి



కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి: రాష్ట్రంలో సాగుతున్న ప్రజావ్యతిరేఖపాలనతోనే తాము బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని బొంపల్లి వార్డు సభ్యులు బోయిని చంద్రశేఖర్, బంక జంగయ్య అన్నారు. శనివారం పరిగి పట్టణంలోని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే అభ్యర్థి టి.రామ్మోహన్‌రెడ్డి నివాసంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 100 మంది కార్యకర్తలతో కలసి వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కేవలం అధికార పార్టీకి చెందిన నేతలకే అందుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ పాలనలో గ్రామస్థాయి లీడర్ల తీరు తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని మండిపడ్డారు. ఏ పథకం అమలులోకి వచ్చిన నేరుగా లీడర్లే రాజకీయాలు చేస్తూ వారికి అనుకూలమైన వ్యక్తులకు పంపిణీ చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామ్మోహన్ రెడ్డి గెలుపునకు తాము ప్రత్యేక కృషి చేస్తామని చెప్పారు. అనంతరం రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ తీసుకువచ్చిన ఆరు గ్యారంటీలతో ప్రజలకు మేలు జరుగుతుందని, కార్యకర్తలు వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రతి ఇంటికి తిరుగుతూ బీఆర్‌ఎస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీ సాధించే దిశగా కార్యకర్తలు గ్రామాల్లో సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్, బొంపల్లి మాజీ సర్పంచ్ రాములు, సీనియర్ నాయకులు అంతిరెడ్డి, గుడిసె రాములు, బాల్‌రాజ్ యాదవ్, హైమద్, ఫైమోద్దీన్ పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలు విడుదల చేయాలి

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సదానందం

కొడంగల్: ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన దీర్ఘకాలిక ఆర్థిక బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్ అన్నారు. ఎస్టీయూ వికారాబాద్ జిల్లా శాఖ వార్షిక కౌన్సిల్ సమావేశం శనివారం కొడంగల్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షుడు పవన్‌కుమార్ అధ్యక్షతన పట్టణంలోని శ్రీవిద్య టెక్నోస్కూల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సందానందం మాట్లాడుతూ.. డీఏ, పీఆర్సీ, సరెండర్‌లీవ్, ఎన్‌క్యాష్‌మెంట్ వైద్య బిల్లులు, జీపీఎఫ్, టీఎస్ జీఎల్‌ఐ రుణాల బిల్లులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, గోవర్ధన్‌రెడ్డి, పరమేశ్, విష్ణుకుమార్, బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. 2023 -25 సంవత్సరానికి సంబంధించి వికారాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా షఫీ, ఆర్థిక కార్యదర్శిగా రాజేష్‌లను ఎన్నుకున్నారు.

మరోసారి భారీ మెజార్టీతో గెలిపించండి

తాండూరు బీఆర్‌ఎస్ అభ్యర్థి రోహిత్‌రెడ్డి



లింగంపల్లిలో మాట్లాడుతున్న రోహిత్‌రెడ్డి

బంట్వారం: తనను మరోసారి ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని తాండూరు బీఆర్‌ఎస్ అభ్యర్థి , ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి కోరారు. శనివారం నియోజకవర్గం పరిధిలోని కోట్‌పల్లి, లింగంపల్లి, బుగ్గాపూర్ ,అన్నాసాగర్ ,ఓగులాపూర్ ,ఇందోల్ గ్రామాల్లో నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోట్లాది రూపాయాలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు. మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారమని ,కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ,ఆ పార్టీ నాయకులు ఎన్ని కుట్రలు పన్నిన గెలుపు తనదేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కోట్‌పల్లి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు ,మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు ఆనంద్ ,నాయకులు సమ్మయ్య ,పెంటారెడ్డి ,నర్సింలు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సమన్యాయం

షాద్‌నగర్ రూరల్: బీఆర్‌ఎస్‌తోనే ప్రజలకు సమన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. శనివారం మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన మైనార్టీలు అంజయ్యయాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. లింగారెడ్డిగూడకు చెందిన వివిధ పార్టీ నాయకులు సర్పంచ్ భీష్వమాధవిరామకృష్ణ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ గెలుపుకోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బెంది శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు భీష్వరామకృష్ణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు గోద లక్ష్మయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే విజయం

చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్, రెబల్ అభ్యర్థి సున్నపు వసంతం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పామెన భీంభరత్, పక్కన సున్నపు వసంతం

చేవెళ్ల: కాంగ్రెస్ కుటుంబసభ్యులంతా చేవెళ్ల గడ్డపై పార్టీ జెండాను ఎగురవేసేందుకు కలిసి పనిచేస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్, రెబల్ అభ్యర్థి సున్నపు వసంతం అన్నారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించి భంగపడిన సున్నపు వసంతం రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పార్టీ నాయకులు, ఆయనతో సంప్రదింపులు జరిపి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయనతో మాట్లాడించారు. చేవెళ్ల అభ్యర్థిని గెలిపించుకొని తీసుకు వస్తే పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత సముచిత న్యాయం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.దీంతో మెత్తబడ్డ వసంతం శనివారం సాయంత్రం భీంభరత్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భీంభరత్ మాట్లాడుతూ..ఎమ్మెల్యే టికెట్ కోసం స్థానికంగా ఉన్న ముగ్గురం పోటీ పడ్డామని.. తమలో ఎవరికి ఇచ్చినా కలిసి పనిచేస్తామని ముందుగానే ఇచ్చిన మాట ప్రకారం షాబాద్ దర్శన్, సున్నపు వసంతం కలిసి రావడం సంతోషకరమని అన్నారు. వసంతం మాట్లాడుతూ.. టికెట్ కోసం ఆశించగా రాకపోవటంతో బాధతోనే రెబల్‌గా పోటీ చేసేందుకు సిద్ధమయ్యాను తప్ప పార్టీని వీడే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి,నాయకులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌తోనే తండాల అభివృద్ధి

బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆనంద్



దార్గులపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

మర్పల్లి: సీఎం కేసీఆర్ గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడంతోనే తండాల్లో అభివృద్ధి జరిగిందని వికారాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి డాక్టర్ మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని నర్సాపూర్ చిన్న తండా, పెద్ద తండా, దార్గులపల్లి, బిల్‌కల్, మల్లికార్జున గిరి గ్రామాల్లో డీసీసీబీ మాజీ డైరెక్టర్, ప్రభాకర్ గుప్తా, జెడ్పీటీసీ మధుకర్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనంద్ మాట్లాడుతూ.. తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసుకున్న తరువాతనే అభివృద్ధి జరిగిందన్నారు. కారుగుర్తుకే ఓటు వేసి మరో మారు ఎమ్మెల్యేగా గెలిపిస్తే గ్రామాల్లో మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని పథకాల గురించి ప్రజలకు వివరించారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌గుప్తా, జెడ్పీటీసీ మధుకర్ మాట్లాడుతూ.. గతంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని బీఆర్‌ఎస్ హయాంలోనే గ్రామాల్లో అభివృద్ధి జరిగిందన్నారు. పేదల మధ్య ఉండే ఆనంద్‌ను గెలిపించాలని కోరారు. అధికారంలోకి రాగానే గ్యాస్ సిలెండర్ రూ. 400 వందలకే ఇస్తామన్నారు. ప్రతి ఇంటికి రూ. 3,000 నగదు అందజేస్తామన్నారు. భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వమే బీమా డబ్బులు చెల్లిస్తుందని, రైతు మరణిస్తే రైతుబీమా పథకం కింద రూ. 5 లక్షలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బట్టు లలిత రమేశ్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మల్లేశం, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ గౌస్, సహకార సంఘం డైరెక్టర్ యాదయ్య, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్‌మిత్ర, అశోక్, ప్రధానకార్యదర్శి రాచన్న, యూత్ ప్రెసిడెంట్ మధుకర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

రెండు రోజులు.. రెండు పార్టీల్లో!



రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన రాంరెడ్డి

చేవెళ్ల: పార్టీ ఫిరాయింపులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ రోజు ఒక పార్టీ..రేపు ఇంకో పార్టీలో కొందరు నాయకులు చేరుతున్నారు. తాజాగా చేవెళ్ల మండలంలోని వెంకన్నగూడ గ్రామానికి చెందిన కొండనోళ్ల రాంరెడ్డి తన అనుచరులతో రెండు రోజుల క్రితం బీజేపీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. శనివారం ఉదయం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రెండు రోజుల్లో రెండు పార్టీలు మారారని పలువురు చర్చించుకుంటున్నారు. దీంతో ఏ నాయకుడు ఏ పార్టీలో కొనసాగుతారో అయోమయ పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. 8వ తేదీన కాలె యాదయ్య, చేవెళ్ల ఎన్నికల ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డిల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇంతలోనే మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు.

కాంగ్రెస్‌తోనే మైనార్టీలకు న్యాయం

- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, ఎంపీ నాసిర్ హుస్సేన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నాసిర్ హుస్సేన్

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ పాలనలోనే ముస్లిం, మైనార్టీలకు న్యాయం జరుగుతుందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, ఎంపీ నాసిర్ హుస్సేన్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక సబ్‌ప్లాన్ అమలు చేస్తామని చెప్పారు. ఆమనగల్లులో శనివారం నిర్వహించిన ముస్లిం మైనార్టీల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అతిథులుగా మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, కడ్తాల కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాసిర్ హుస్సేన్ మాట్లాడుతూ.. ముస్లిం, మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని గుర్తుచేశారు. పార్టీ ముస్లిం, మైనార్టీ డిక్లరేషన్ ప్రకటించిందని చెప్పారు. మైనార్టీ సంక్షేమం కోసం బడ్జెట్‌ను పెంచడంతో పాటు మైనార్టీ యువత, మహిళలకు సబ్సిడీ రుణాల కోసం ఏటా రూ.1000 కోట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. వివాహం చేసుకునే ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, ఇతర జంటలకు రూ.1.60 లక్షలు ఆర్థికసాయం అందిస్తామన్నారు. ఇళ్లులేని మైనార్టీలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇంటిస్థలంతో పాటు నిర్మాణానికి రూ.5 లక్షలు అందిస్తామని వివరించారు. మసీదుల ఇమామ్‌లు, మోజంలు, దర్గాల ఖాదింలకు నెలకు రూ.12 వేలు గౌరవ వేతనం అందిస్తామని ఆయన తెలిపారు. అబ్దుల్ కలాం తోఫా ఎ తలీం పథకం కింద చదువుకున్న ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, ఇతర మైనార్టీ యువతకు ఆర్థిక చేయూతనివ్వడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ మండల మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్, వివిధ మసీదు కమిటీల అధ్యక్షులు గౌస్, ఖలీల్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

దీపావళి సందడి

- టపాసుల దుకాణాలు ఏర్పాటు
- కిటకిటలాడుతున్న మార్కెట్లు



పూలు కొంటున్న ప్రజలు

అనంతగిరి: చీకటిని చీల్చుతూ వెలుగులు నింపే దీపావళి వేడుకలు జరుపుకొనేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. టపాసులు, స్వీట్లు, పూలు కొనుగోలు చేస్తున్నారు. లక్ష్మీపూజల కోసం దుకాణాల వద్ద బారులుతీరారు. దీపావళి సందర్భంగా పట్టణంలోని వ్యాపారస్తులు, గృహ యాజమానులు తమ తమ దుకాణాలు , ఇండ్లను లక్ష్మీ పూజలు చేసేందుకు పరిశుభ్రం చేస్తున్నారు. పలువురు వ్యాపారులు దుకాణాలకు కొత్తకొత్త రంగులు వేయడంతో విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేస్తున్నారు. దీపావళి పండుగను పురస్కరించుకొని పూలు, ప్రమిదలు, బొమ్మల విక్రయాలతో పట్టణంలోని మార్కెట్ సందడిగా మారింది. చుట్టూ పక్కల ప్రాంతాల రైతులు తమ పొలాల్లో పండించిన పూలను వికారాబాద్‌కు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పూలకు భలే గిరాకీ ఉంది. మార్కెట్‌లో కిలో పూలు రూ.100 పలుకుతున్నాయి. స్వీట్ హౌజ్‌లో దీపావళి స్పెషల్ స్వీట్లు తయారు చేసి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. స్వీట్ హౌజ్‌లు జనాలతో కిటకిటలాడాయి, పట్టణంలో మొత్తం 20కు పైగా టపాసుల దుకాణాలు వెలిశాయి. చిన్న పెద్ద అందరూ వచ్చి టపాసులు కొనుగోలు చేస్తున్నారు. గతం కంటే టపాసులు ధరలు పెరిగాయి.



రకరకాల స్వీట్లు

పూలకు భలే గిరాకీ

పెద్దేముల్: దీపావళి పండుగ వేళ అరటి, గుమ్మడి పూలకు భలే డిమాండ్ ఉంది. లక్ష్మీపూజలకు, వ్యాపారస్తులు దుకాణాల అలంకరణకు ఎక్కువగా వాడుతారు. దీంతో ప్రస్తుతం మార్కెట్‌లో కిలో బంతి పూలు రూ.80 నుంచి రూ.120, చామంతి కిలో రూ. 200, రెండు అరటి చెట్లు రూ.150 నుంచి రూ.200, గుమ్మడి కాయ రూ.150నుంచి రూ.200ల వరకు విక్రయిస్తున్నారు. పెద్దేముల్ మండలంలోని గాజీపూర్, గోట్లపల్లి, ఇందూరు, తింసాన్‌పల్లి, బుద్దారం గ్రామాల్లో పండించిన గుమ్మడి, బంతి, అరటి చెట్లను తాండూరు వికారాబాద్, హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లి వ్యాపారస్తులు విక్రయాలు చేయడం మండలంలో మామూలే. దీపావళి పండుగ నెల రోజుల ముందే వ్యాపారస్తులు రైతుల వద్ద అరటి చెట్లను రూ.20 రూ.30 వరకు ఖరీదు చేసి వాటిని డీసీఎం ఆటోల్లలో తరలిస్తారు. సుమారు 20 రోజుల పాటు వ్యాపారం కొనసాగుతుందని పలు గ్రామాల వ్యాపారస్తులు అంటున్నారు.



ప్రమిదలు కొంటున్న మహిళలు



చిగుళ్లపల్లి గ్రౌండ్‌లో వెలసిన టపాసుల దుకాణాలు



ట్రాక్టర్‌లో తాండూరుకు తరలిస్తున్న అరటి దుంగలు



విక్రయానికి సిద్ధంగా గుమ్మడి కాయలు